# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 9:05 గంటల తర్వాత నో ఎంట్రీ
- గంట ముందే సెంటర్‌లోకి అనుమతి
- 8:45 గంటలకు ఓఎమ్మార్‌షీట్ అందజేత
- 1,532 పరీక్షాకేంద్రాల ఏర్పాటు
- నిఘా నేత్రంలో ఎగ్జామ్ సెంటర్స్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొత్తం మూడు గంటలపాటు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను కాస్త ముందుగానే సెంటర్‌లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఉదయం 8:45 గంటలలోపు సెంటర్‌లో ప్రవేశించడం ఉత్తమమని అధికారులు సూచించారు. ఆలస్యంగా వచ్చే వారిని అంటే 9:05 గంటల తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించరు. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు రెండోభాష పేపర్-1కు పరీక్ష నిర్వహిస్తారు. గురువారం సెకండియర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,532 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్టియర్‌లో 4,88,448 విద్యార్థులు, సెకండియర్‌లో 5,08,523 విద్యార్థుల చొప్పున 9,96,971 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. వీరిలో గతంలో ఫెయిలైన 67,735 మంది విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరుకాబోతున్నారు. పరీక్షల కోసం 29,992 మంది ఇన్విజిలెటర్లు, 72 మంది ఫ్లయింగ్‌స్క్వాడ్, 124 సిట్టింగ్ స్క్వాడ్‌లకు విధులు కేటాయించారు. ఇంటర్‌బోర్డు అబ్జర్వర్లను (పరిశీలకులు) సైతం రంగంలోకి దించనున్నది.

### ఏర్పాట్లు ఇవే..

- కంట్రోల్ కమాండ్ సెంటర్‌లో ప్రత్యేకంగా స్మార్ట్‌నిఘాను పెడుతున్నారు. 45 పరీక్షాకేంద్రాలకు ఒక బృందం చేత నిఘాపెట్టారు.
- పరీక్షకేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో బీఎన్‌ఎస్ 163(144 సెక్షన్) అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు ఉంటుంది.
- హాల్‌టికెట్ లేకుండా విద్యార్థులను పరీక్షకు అనుమతించరు. హాల్‌టికెట్‌పై తప్పులుంటే ప్రిన్సిపాళ్లను, ఇతర అధికారులను సంప్రదించి సవరించుకోవచ్చు.
- విద్యార్థులను గంట ముందు నుంచే అంటే ఉదయం 8 గంటల నుంచే పరీక్షాకేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 8:45 గంటలకు ఓఎమ్మార్‌షీట్‌ను అందజేస్తారు. ఆలస్యంగా అంటే ఉదయం 9:05 గంటల తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించరు.
- వాచ్‌లు, సెల్‌ఫోన్లు, పేజీలు, క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ముద్రిత సామగ్రిని పరీక్షాకేంద్రాల్లోకి అనుమతించరు.

## 'ఎంబీఎస్'పై ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు

### రూ.504 కోట్ల మోసంపై ప్రత్యేక కోర్టు విచారణ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఎంబీఎస్ జ్యువెలరీ సంస్థ అధినేత సుఖేశ్‌గుప్తా, ముసద్దీలాల్ జెమ్స్ అండ్ జ్యువెల్స్, అనురాగ్‌గుప్తా, కర్రి రవిప్రసాద్, వల్లూరి మోహన్‌రావుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేసింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దాఖలు చేసిన ఈ ఫిర్యాదును హైదరాబాద్‌లోని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి విచారణకు స్వీకరించారు. ప్రభుత్వ రంగంలోని ఎంఎంటీసీ సంస్థకు సుఖేశ్‌గుప్తా రూ.504 కోట్లు ఎగ్గొట్టారని, దీనిపై ఈడీ ఇప్పటికే పీఎంఎల్‌ఏ, ఫెమా చట్టాల కింద విచారణ జరిపి, పలు ఆస్తులను జప్తు చేసింది.

## 7తో ముగియనున్న నీట్ దరఖాస్తు గడువు

హైదరాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్(యూజీ) ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 7తో ముగియనున్నది. ఇప్పటివరకు నీట్‌కు 21 లక్షలకుపైగా దరఖాస్తులొచ్చినట్టు తెలిసింది.

## ఫస్టియర్ విద్యార్థికి సెకండియర్ హాల్‌టికెట్

- ఇంటర్ పరీక్షల్లో వింత ఘటన
- సతమతమవుతున్న విద్యార్థి

హైదరాబాద్/వనస్థలిపురం, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థికి ఫస్టియర్, సెకండియర్ రెండు పరీక్షల హాల్‌టికెట్లు జారీ అయ్యాయి. సీఈసీ కోర్సు చదువుతున్న ఈ విద్యార్థి ఫస్టియర్‌లో ఐదు సబ్జెక్టులు, సెకండియర్‌లో ఐదు సబ్జెక్టుల చొప్పున మొత్తం 10 సబ్జెక్టులకు హాల్‌టికెట్ జారీ అయ్యింది. ప్రస్తుతం ఫస్టియర్‌లో ఉండి, సెకండియరే చదవని ఆయా విద్యార్థి ఇప్పుడు సెకండియర్ పరీక్షలు రాయడమా.. లేదా ? అన్నది ఆయా విద్యార్థికి ప్రశ్నార్థకంగా మారింది. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన విద్యార్థి ఏర్పుల వంశీ వికాస్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. వంశీకి సెకండియర్‌కు సైతం హాల్‌టికెట్ జారీకావడంతో కాలేజీ నిర్వాహకులను సంప్రదించాడు. వారు రెండు పరీక్షలు రాయమని చెబుతుండటం, తనకు అంత వయస్సు లేకపోవడం భవిష్యత్తులో ఇబ్బందులొస్తాయన్న ఆందోళనలో సదరు విద్యార్థి ఉన్నాడు. కాలేజీ తప్పిదమా.. లేక ఇంటర్ బోర్డు తప్పిదమో తెలియదు కానీ సెకండియర్‌కు ఎలా పరీక్షలు రాయాలి అన్న సందిగ్ధతలో విద్యార్థి ఉన్నాడు. సిద్దిపేట జిల్లాలో సమీపంలోని కాలేజీలను కాదని, 48 కిలో మీటర్ల దూరంలో సెంటర్ వేసిన ఘటన మరువకముంటే తాజాగా హాల్‌టికెట్ ఘటన వెలుగుచూసింది.

















